కథా నిలయం
3487
శ్రీకాకుళం

# 1

## విచిత్రనళీయం

అనగా అనగా చేదినగరంలో భీమరాజని ఒక రాజు వుండేవాడు. ఆయనకి దమయంతి అని ఒక కూతురు. ఆమెకి పదహారేళ్లు వొచ్చాయి. ఆమె చాలా చక్కని పిల్ల. నిషధపురంలో వుండే నలుడనే ఆయన్ని వొకసారి చూచి, అప్పణ్ణించి ఆయన్ని గాఢంగా మోహించింది. యెన్ని మంచి సంబంధాలు వచ్చినా వొద్దంటుంది. చివరికి ఆ దమయంతి కలవరింపులవల్లా, ఆమె వ్రాసి అక్కడక్కడ పారేసే చీట్లవల్లా ఆమె మనసు నలుడిమీద నిలిపిందని తెలుసుకుని, ఆ నలుడి దగ్గరికి మనిషిని కబురుపంపారు. ఒక మంచి సంబంధం వుందనీ, ఆపిల్ల మనసు నలుడిమీదనే నిలిపిందనీ, ఆ వంశములో పెళ్లిచేసుకోడం చాలా అదృష్టమనీ నలుడితో చెప్పారు.

"నామీద మనసు నిలిపిందా? అంతకు ముందెందరిమీద నిలిపిందో! చిన్నప్పుడే పెళ్లి చేయక, యీ సంఘసంస్కర్తల మాటలు విని, పిల్లల్ని యీడు వొచ్చిందాకా వుంచితే యిదే అవర్థం. మీవూరు

నించే ఎవరోపిల్ల రోజు కోవుత్తరం వ్రాస్తోంది. రెండు రిజిస్టరు వుత్తరాలు కూడా పంపింది. మిమ్మల్ని కూడా ఆమే పంపించి వుంటుంది. యిదివరకు నేను పెళ్లి చేసుకోలేదయ్యేను. నాకు యీ విషయాల్లో ఆ అమ్మాయి కున్న అనుభవం లేదు. పెద్దవాళ్ల నడుగుదామంటే, మావాళ్లందరూ, నన్ను పెద్దవాణ్ణి చేసి చచ్చారు. ఐనా సరేలెండి... యేమాత్రం కట్నమిస్తారు? యింతవరకూ పాట మూడులక్షలవరకూ పెరిగింది'' అన్నాడు. నిరాశ చెంది మనిషి వెళ్లాడు.

''అంతకట్నం మెక్కడ యిస్తా'' మన్నాడు భీమరాజు. దమయంతి మంచంపట్టింది. యెన్నికబుర్లు పంపినా నలరాజు యేమాటా చెప్పలేదు. అడిగినకొద్దీ యిట్లానే బిగుస్తాడని, చివరికి పత్రికలో ప్రకటన వేయించారు.

"వెలమ వరుడు కావలెను

పదహారేళ్ల వెలమకన్నె. రూపవతి. విద్యావతి. ఆరోగ్యవతి. కట్నము రెండులక్షల రూపాయలు; రెండువందల ఏనుగలు, ముప్పైఆవులు, నూరు వేటకుక్కలు, యాభై గుర్రాలు. వరుడు వెలమకులస్తుడూ, బలశాలీ, విద్యావంతుడై వుండవలెను.

దరఖాస్తులు 'బీ', కేర్ ఆఫ్ రాచపత్రిక, అని పంపవలెను."

వేనకువేలు దరఖాస్తులు వొచ్చాయి. కట్నం తప్పిపోతుందేమో నని నలుడుకూడా, వాళ్ళు అనుకున్నట్టే, దరఖాస్తు పంపాడు. పోష్టులో నలుడి ముద్రతో కవరు వొచ్చిందని వినగానే దమయంతి చివాలున మంచంమీదనుంచి లేచి, తలంటిపోసుకొని కాఫీ తాగి, మూడువేలమంది ముత్తయిదులకి ఫలప్రదానమూ, ఆరువేల బ్రాహ్మణ్యానికి సంతర్పణా, గుడ్డివారికి కుంటివారికి అన్నవస్త్రదానమూ చేయించింది.

అక్టోబరు పదోతారీఖున, మీనలగ్నాన, స్వయంవరం పెడదా మనుకున్నారు. కాని దమయంతి 'అంత కాలమా ఆగడం!' అనడంచేత, ఆగస్టుకు మళ్ళీ యిట్లా ప్రకటన చేయించాను :

"రాచకన్య పాణికై దరఖాస్తుదారు లందరూ అగస్టు ౨౪ గో తేదీన మూడోజాము మొదటి పాదాన చేదినగరంలో భీమరాజుగారి యింటివద్ద, సరిగా ఉదయం పదిగంటలకు హాజరు కావలెను.

విస్తారముగా యిదివరకే వొచ్చినందున, యిటుపైని యెటువంటి దరఖాస్తులునూ అంగీకరింపబడవు."

స్వయంవరంనాటివరకూ దమయంతి మూర్ఛలతోనూ, శీతలోపచారములతోనూ గడిపింది. విరహగీతాలు వ్రాసి, అనేక పత్రికలకు పంపింది. వాటి కాపీలన్నీ యెప్పటి కప్పుడు నలుడికి అందజేసింది.

చివరికి స్వయంవరం ఆసన్నమయింది. నలుడు చక్కగా టై, కాలర్ అలంకరించుకుని, మీసాలు దువ్వుకుని, సొంత మోటారులో చేదిపురం చేరుకున్నాడు. యెదురుగా మైదానంలో ఏరోప్లేనులోనించి నలుగురు తెల్ల దొరలు దిగారు.

నలుడు వాళ్ళదగ్గిరకి వెళ్ళి—

“యీయంత్రం ఖరీదెంతవుతుంది?” అని అడిగాడు.

“యాభై వేల రూపాయ” లన్నారు.

“కట్నంలో యింక లక్షన్నరేనా మిగిలేది, యిటువంటి దొకటి కొంటే”, అనుకున్నాడు.

“యేమన్నా తగ్గించడానికి వీల్లేదా?” అన్నాడు. దొరముఖ్యుడు నలుణ్ణి యెగాదిగా చూసి,

“మాకో సహాయం చేసి పెడతావా మరి?” అన్నాడు.

“చెప్పండి.”

“ఈ రాజకూతురు దగ్గరకు పోయి మమ్మల్ని పెళ్ళిచేసుకోమని చెప్పివస్తావా?”

“మీరెవరు?”

“బెంగుళూరి పొగాకు వర్తకులం.”

“మీలో ఎవర్ని పెళ్ళిచేసుకోవాలి?”

“నలుగుర్నీ.”

“నలుగుర్నీనా?”

“మీలో ఒకామె ఐదుగుర్ని చేసుకుందటగా!”

“దానికి మా రుషులు వొప్పుకున్నారు.”

"దీనికే వొప్పిద్దాం."

"రుషు లిప్పుడు లేరు."

"యెక్కడికి వెళ్లారు?"

"యేమో!"

"ఒక రిద్దర్ని కొందాం."

"దొరకరు."

"పోనీలే, మాలో ఒకర్నైనా సరే, పెళ్ళిచేసు కోమను."

రెండు లక్షలూ పోయేట్లున్నాయని నలుడికి గుండెల్లో రాయిపడ్డది.

"సరే, నేను ఆమెదగ్గరకి లోపలికి వెళ్ళే విధ మెట్లా?"

"ఆడవేషం వేస్తాం."

'వెళ్ళి, వీళ్ళకి టోపీవేద్దా' మనుకున్నాడు.

"సరే, మీయంత్రం ఖరీ దెంత తగ్గిస్తారు?"

"పది వేలు."

"యిరవై."

"సరే."

మీసాలు గొరిగి, ఆడవేషం వేసి, వుంగరాలూ రిస్టువాచీలూ యిచ్చి, అమ్మతో పొమ్మన్నారు. నలుడు దమయంతిదగ్గిరికి వెళ్లాడు.

నలుడికి స్వాగత పద్యాలలో మూడోదాంటో మధ్యపాదంలో యతికుదరక కొట్టుకుంటోంది దమయంతి.

"యేమి టాబాధ?" అన్నాడు.

"యతి కుదరలేదు."

"యేదీ, చదువు."

యతి వేయించాడు. ఆమె రత్నాలహారం అతని మెడలో వేసి,

"నువ్వెవరు?" అంది.

"నువ్వెవర్ని పెళ్ళి చేసుకుంటావు?"

"నలుణ్ణి."

"దొరలొస్తే?"

"నాకు వొద్దు."

"ఇంకెవరన్నా వొస్తే?"

"నాకు వొద్దు."

"ఆ దొరలు చాలా బలవంతులు, ధనవంతులు"

"ఐనా నాకు వొద్దు."

"వెర్రిదానా, ఆ నలుడు నీ కెందుకు?"

"నా కతనిపైని ప్రేమ."

"ఎందుకు?"

"ఆ కారణాలు చెప్పడానికి వీల్లేదు. పోనీ, పటంలో అతని మీసం చూశావా? చూస్తే నువ్వే ఎగపడతావు, అతనికోసం!"

"ఆ నలుడు నిన్ను వొద్దంటే!"

"చచ్చిపోతాను."

"ఏవిధంగా?"

"తాడుతోగాని, నుయ్యిలోగాని..."

"ఆ మాటమీదనే వుంటావా?"

"తప్పకుండా."

"కట్నం నిజంగా యిస్తారా?"

''ఆ''

''ఆ నిమషాన్నే చెల్లిస్తారా?''

''ఆ''

''సరే, శలవు''

తిరిగివొచ్చి, దొరలతో, దమయంతి వొప్పుకో లేదని చెప్పి, లిస్టు త్రిప్పి చూసేటప్పటికి పదయింది. సభాస్థానానికి పరిగెత్తాడు. అనేకమంది ప్రభువులు ఆసీనులై వున్నారు. దమయంతి సర్వాలంకృతఅయి పుష్పహారం చేతులో పట్టుకొచ్చి, కుర్చీలో యెదురుగా కూర్చుంది. యీపక్కన తండ్రీ, ఆ పక్కన సఖి కూచున్నారు. ముందు బల్లమీద అప్లికేషన్ల కట్ట వున్నాయి. దమయంతి సులోచనాలు పెట్టుకొని, అన్నీ పరీక్షించి, నలుడి దరఖాస్తు బైటికి తీసింది.

సఖి ''నలుడూ, నలుడూ!'' అని అరిచింది.

నలుడు ''హాజర్'' అని లేచి నిలుచున్నాడు.

''ఈయన కాదు'' అంది దమయంతి.

''నేనే'' అన్నాడు నలుడు.

''అబద్ధం.''

''కాదు. నేనే.''

''అయితే నీ మీసా లేవీ?''

''పొద్దున్న దొరలు గొరిగారు.''

''నమ్మను. నిన్ను తెలిసినవాళ్ళెక్కడెవ రన్నా వున్నారా?''

''యీ దొరలు.''

Cbx3 దొరలు "మాకు మీసా లున్నాయి, మేమే నలుల"మన్నారు. కాదంది. "మమ్మల్ని పెళ్ళిచేసుకుంటే యేరోప్లేనులో తిప్పుతాం. చేసుకోకపోతే తంతా"మని రివాల్వర్లు బైటికి తీశారు. సిపాయి 'మ్యూటినీ' జ్ఞాపకానికి తేగా కూచున్నారు.

యింక విధిలేక, దొరలని పెళ్ళిచేసుకొని గొడ్డు మాంసం తినాలని భయపడి,

"మళ్ళీ నువ్వు నలుడివి కాకపోతే ఈ స్వయంవరం రద్దుచేసుకునే షరతుమీద నిన్ను వరిస్తాన్నా"నని పూలహారం సగం తుంచి నలుడిమెడలో వేసింది.

అందరూ భోజనాలు చేసి, యెవరి యిళ్ళకు వారు బయలుదేరారు.

తెల్లదొరలు నలుగురూ విమానమెక్కి బెంగుళూరు వెడుతూవుండగా పాకాలదగ్గిర యింకో చిన్న విమానమెక్కి 'సని' అనే పొట్టి బొండువొర యెదురుపడ్డాడు.

అతడు గుఱ్ఱపు పందాల అడావిడిలో స్వయంవరంసంగతి మరచిపోయి ఆలస్యంగా వొస్తున్నాడు. స్వయంవరం అయిపోయిందని వుడుకుమోతుతనం వొచ్చి, నలుడినించి ఆ రెండు లక్షలూ లాగాలనుకున్నాడు. దానికోసం పందాలలో లాభమొచ్చిన వెయ్యిరూపాయిలూ పెట్టుబడి కింద పెట్టి, నిషధపురంలో బ్రాందిషాపు తెరిచాడు. నలుడి బావ, పుష్కలుడనేవాడితో యీ 'సని' స్నేహంచేసి, వాడిద్వారా నలుడికి ఆప్తుడైనాడు. వీళ్ళు చల్లగా యెంత ప్రయ

త్నించినా, నలుడు తన లోభత్వంవల్ల కాపాడబడి, వారి మాయలకు లొంగలేదు, మొదట్లో.

మూడేళ్లు గడిచింది. యేడాది కొకరు చొప్పున దమయంతి యిద్దరు పిల్లల్ని కన్నది. నలుడికి సంసారం మీాది మోజు తగ్గింది. ఇంట్లో కూచుంటే, యెప్పుడూ యేం తోస్తుంది? చేదినగరం కబుర్లు యెన్నని చెప్పుతుంది దమయంతి? ఆ పిల్లల ఆటపాటలు చూసి యెంతకాలం సంతోషిస్తూ వుండగలడు నలుడు? మోటారుమీాద షికారుపోదామంటే, దమయంతీ వొస్తా నంటుంది. అది అమర్యాద కదా! ఉద్యానవనంలో తిరిగి తిరిగి, చెప్పుకుని చెప్పుకొని చెట్ల పేర్లన్నీ వొచ్చాయి. రాత్రి నక్షత్రాలపేర్లు వింటే డోకువొచ్చే పర్యంతమయింది. అందువల్ల నలుడు క్రమంగా పుష్కలుడితోనూ, సనితోనూ చీట్లపేక మొదలు పెట్టాడు. మూడు నెలల్లో సిగరెట్లు, ఆరు నెలల్లో డబ్బులు పెట్టి జూదం, తొమ్మిదినెలల్లో బ్రాందిబుడ్లు అలవాటైనాయి. ఒక్కయేడాదిలో ఇల్లు అంతా గుల్లయింది. తండ్రి చిన్నప్పటినుంచి బోధించిన పతివ్రతా ధర్మం ప్రకారం, దమయంతి, భర్త కెదురుచెప్పక నగలూ, ధనమూ అన్నీ నవ్వులో యిచ్చేసి, యీత్యాగంవల్ల, వొచ్చేజన్మంలో, ఇతనే మంచిభర్తగా సంభవిస్తాడని సంతోషపడుతోంది. ఒకరోజు పుష్కలుడూ, 'సనీ' బాగా తాగి యింట్లో ప్రవేశించి దమయంతిని చాలా అవమానం చేశారు. నలుడు ఆకాత్తుగా వొచ్చి, నౌకర్ల సహాయంతో యిద్దర్నీ చావ

తన్ని వెళ్ళగొట్టాడు. ఆ కోపాన వాళ్ళిద్దరూ తమకు బాకీవున్న సొమ్ముకి దావా తెచ్చారు. నలుడు దివాలా దరఖాస్తు దాఖలుచేసి, సిగ్గు భరించలేక, ఆ వూరినించి ప్రయాణమైనాడు. యిద్దరు పిల్లల్నీ, భార్యనీ పుట్టింటికి పొమ్మన్నాడు. కాని భర్త వొది లిన భార్యని పుట్టింటివాళ్ళు పెట్టే తిప్పలు దమయంతి ఆలోచించుకుంది.

"అయ్యో, మీరు వూళ్ళవూరూ తిరగడంలో వుండగా నేను పుట్టింట సుఖపడనా! ఏం మాటలవి? భార్య భర్తనీడ. సీత రాముడితో సకలమైన కష్టాలూ పడి చివరికి సుఖపడలేదా! నేనేం సీతకి తీసిపోయానా? మీతోనే నేనూ వొస్తాను." అని పెంకెపట్టు పట్టింది. ఇంక విధిలేక నలుడు వొప్పుకున్నాడు. పిల్లలిద్దర్నీ తన పుట్టింటికి పంపింది దమయంతి. తండ్రితో తానూ, భర్తా తీర్థయాత్రలకి పోతున్నామని చెప్పమని కబు రంపింది.

ఇద్దరూ వూరూరా బిచ్చమెత్తి తింటూ తిరిగారు. కాని నలుణ్ణీ, దమయంతినీ చూసినవా ళ్ళందరూ, "ఒరే, శుభ్రంగా తిండిపోతులాగున్నావు. కూలిపని చెయ్యరాదా? నీకు బిచ్చమెందుకు?" అనీ, దమయంతిని చూసి "మా ఇంట్లో దాసీపని చెయ్య రాదా?" అనీ అడిగేవారు.

కనక దమయంతి వొక్కత్తే వెళ్ళి, "నా కెవరూ దిక్కులేరు. నా భర్త ఎవత్తెనో తీసుకు లేచిపోయా" డని చెప్పి బియ్యం ముష్టి తెచ్చుకుంటే ఇద్దరూ వొండుకు

తినేవారు. తక్కిన బిచ్చగాళ్లతో జూదమాడి, నలుడు తన చొక్కానీ పంచనీ వోడిపోయినాడు. అందుకని దమయంతి చీరెలో సగం కట్టుకుని తిరగాల్సివొచ్చింది.

ఒకరోజు బియ్యం చాలా తక్కువగా దొరికాయి. యిద్దరికీ చాలలేదు. "నేనూ సంపాదించింది. నా కెక్కువ అన్నం రావాలి" అంటుంది దమయంతి. "భర్తఆకలి తీరినతర వాతగాని భార్య భోజనం చేయకూడదని ధర్మశాస్త్రాలలో వుం"దంటాడు నలుడు. "ధర్మశాస్త్రాలు వూళ్లల్లోగాని, అడవుల్లోనా" అని మంకుపట్టు పట్టి, అరిచి, కోయవాళ్లతో చెప్పుకుని, తనే అంతా తినేస్తోంది దమయంతి. నలుడు విస్తరి చించివేసి, మెతుకులు వెదజల్లి దమయంతిని వొదిలి కోపంతో తాను సుఖంగా పోయినాడు. అట్లాంటి దుర్మార్గుణ్ణి దేవుడు వూరికే వొదులుతాడా? వెంటనే ఓ పాముచేత కరిపించాడు. నలుడు భయపడి దగ్గిర వున్న వూరికి పరిగెత్తి చికిత్స చేయించుకున్నాడు. ఆ మందు విషాన్ని విరిచిందిగాని, దాని వుద్రుతంవల్ల నలుడి శరీరాన్ని వుడుకెత్తించి, తన తల్లికికూడా అతని రూపం గుర్తుపడకుండా మార్చేసింది. యిదీ మంచికే కలిగిం దనుకుంటో తిరిగి తిరిగి, నేయు డనే రాజువద్ద వంటవాడుగా కుదిరాడు అతను.

యిక్కడ దమయంతి యేడ్చి యేడ్చి, నలుడికోసం వెతుక్కుని, అన్నమంతా యిస్తానని పిలిచి పిలిచి, కసి తీర తిట్టుకుని బైలుదేరి వెడుతూ వుండగా, ఒక మెరుకలరాజు ఆమెని చెరపట్టాడు.

అబల యేంచేస్తుంది? ఒకరోజు వాడు నిద్ర పోతూ వుండగా వాడి మంచానికి నిప్పంటించి, "నేనే పతివ్రత నైతే వీడు భస్మమౌగాక!" అని శపించి, తన దోవన వెళ్ళిపోయింది. మధ్యలో కొందరు వర్త కుల్ని కలుసుకొని వాళ్ళతో స్నేహంచేసి, చివరికి చేది నగరం చేరింది. తల్లిదండ్రులు కూతుర్ని గౌరవించి యింట్లో వుంచుకున్నారు.

కొన్నాళ్ళ కావూరి వితంతు వివాహపు ఏజంటు వొచ్చి, దమయంతిని మళ్ళీ వివాహం చేసుకోమని ప్రోత్సాహించాడు. బీదవాడైనా, బుద్ధిమంతుడైన కుర్రాణ్ణి వరుడుగా చూసేటప్పటికి దమయంతికే సరదా పుట్టింది. కాని నలుడు చావలేదేమోనని అందరికీ దిగులూ, భయమూ పట్టుకుంది. అందువల్ల మళ్ళీ రాచపత్రికలో యీ విధంగా ప్రకటన చేయించారు ఋతుపర్ణుడు :

"గొప్ప బహుమానము

నలుడు మరణించిన సంగతి రూఢిగా తెలియ

జేసినవారికి."

ప్రత్యుత్తరం యెక్కడనుంచీ రాలేదు. దమ యంతి తాళలేక తహతహలాడిపోతోంది. వివాహ ముహూర్తం నిశ్చయించారు. కాని రాచపిల్ల గనకా, పునర్వివాహానికైనా స్వయంవరం కూడదని శాస్త్రా లలో లేదు గనకా తిరిగి స్వయంవరం ప్రకటించారు. కట్నం నాలుగులక్షలన్నారు.

నలుడీ ప్రకటనలన్నీ చూస్తోనే వున్నాడు. ఋతుపర్ణుడు చదివి పత్రికలు వంటకాయితాలకింద పారేస్తోవుంటే, పొయిదగ్గర నలుడు చదువుకుంటూ వుంటాడు.

మళ్లీ తనని కనుక్కొని తీసుకుపోయి, ఆ దమయంతికీ, పిల్లలకీ కడతారేమోనని అతని భయం.

దమయంతికి ద్వితీయవివాహ మనేటప్పటికి అతని కతిసంతోష మయింది. యెందుకంటే, అతనికి ఆ యింట్లో దాసీపైని మోహం పుట్టింది. దానికి అయిదువందల రూపాయల ఆదాయముంది. కాని యీ నాలుగులక్షల కట్నమో! తనే పెళ్ళిచేసుకుంటే తనకే దక్కుతాయిగా! అయిదువంద లెక్కడ, నాల్గులక్ష లెక్కడ! కాని యీ గారికి వాగ్దానమిచ్చాడే! అయినా తనకి భార్యాబిడ్డ లుండగా దీన్నెట్లా వివాహం చేసుకోడం? తనకి సాటా, కులమా, బంధువా?

అందరూ స్వయంవరానికి కూచున్నారు. సిగ్గుతో, దమయంతి వచ్చి తన యువకుడి మెళ్ళో పూలహారం వేసింది. ఇంతలో వెనకనించి కురూపి వొకడు లేచి, "యిది పెళ్లేదు, యిది నాభార్య!" అన్నాడు. ఎంత చెప్పినా విన లేదు. పిచ్చివాడని, పోలీసుల్ని పిలిచి వొప్పచెప్పారు. విచారణ జరిగింది. నలుడు తన ఐడెంటిటీ రూఢిపర్చాడు. దమయంతి తన యువకుడి చెయ్యి చప్పున వొదిలి, పూలదండ తెంపి నలుడిమీద పడేసి నమస్కరించింది.

"నాలుగు లక్ష లివ్వండి" అన్నాడు.

"మళ్ళీ నాలుగు లక్షలేమిటి, ఇన పెళ్ళికి!"

"ఐతే, నేను వెళ్ళిపోతాను."

"పో, యింక నున్నాడు."

చాలా చిక్కువొచ్చింది నలుడికి. యేం తోచక కొడుకుదగ్గిరికి వెళ్ళి,

"నన్ను వెళ్ళమంటావా నాయనా?" అన్నాడు.

కుర్రాడు లబ్బున యేడ్చి,

"అమ్మా, యీ బూచాణ్ణి పొమ్మను" అన్నాడు.

కాని దమయంతిమాత్రం నలుణ్ణి వొదలలేదు. పతివ్రతగనక.